28న రాష్ట్ర క్యాబినెట్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
శుక్రవారం (25న) జరగాల్సిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ఈనెల 28న మధ్యాహ్నం రెండు గంటలకు క్యాబినెట్ జరగనుంది. ఈమేరకు శుక్రవారం సిఎంఒ ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఎఐసిసి సమావేశంలో పాల్గొనేందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి కూడా వెళ్లారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా అక్కడే ఉండిపోయారు. దీంతో సిఎం, ఐదుగురు మంత్రులు అందుబాటులో లేకపోవడంతో క్యాబినెట్‌సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేసినట్టు ప్రకటించింది.

మూసీ ప్రాజెక్టులోకి భారీగా వరద... గేట్లు ఎత్తివేత


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
భారీ వర్షాలతో తెలంగాణలోని పలు జలాశయాలు నిండుతున్నాయి. నల్గొండ జిల్లా కేతేపల్లి వద్ద మూసీ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో శుక్రవారం అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తారు. 3, 8 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 1,653.11 క్యూసెక్కులుగా ఉండగా.. ప్రస్తుత నీటిమట్టం 643.45 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ పూర్తి సామర్థ్యం 4.46 టిఎంసిలు కాగా.. ప్రస్తుతం 4.07 టిఎంసిలుగా ఉంది.

ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. శనివారం ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. శని, ఆదివారాల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశమున్నది. ఈనెల 30న ఎప్‌సెట్ రెండోవిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తారు. ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 172 ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 83,054 సీట్లున్నాయి. ఎప్‌సెట్ మొదటి విడతలో 77,561 మందికి సీట్లు కేటాయించారు. వారిలో 59,980 మంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. ఇంజనీరింగ్‌లో 7,650 సీట్లకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అందులో కన్వీనర్ కోటాలో 5,355 సీట్లున్నాయి. దీంతో ఎప్‌సెట్ రెండో విడతలో కన్వీనర్ కోటాలో 28,429 సీట్లు అభ్యర్థులకు అందుబాటులో ఉన్నాయి.

టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టండి

- 'తైవాన్' పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో టెక్స్ టైల్ రంగం అభివృద్ధికి అపార అవకాశాలున్నాయనీ, ఇక్కడ పెట్టుబడులు పెట్టి 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం కావాలని తైవాన్ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో తైవాన్ టెక్స్ టైల్ ఫెడరేషన్ (టిటిఎఫ్) అధ్యక్షులు జస్టిన్ వాంగ్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం మంత్రిని కలిసి తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను చర్చించింది.. రాష్ట్ర ప్రభుత్వం వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కెఎంటిపి) గేమ్ ఛేంజర్‌గా మారనుందని ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. కేఎంటీపీలో జిన్నింగ్, స్పిన్నింగ్, వీవింగ్, ప్రాసెసింగ్, గార్మెంటింగ్ అన్నీ ఒకే చోట పూర్తి చేసేలా అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశామన్నారు. యంగాన్, కైటెక్స్, గణేషా ఎకోస్ఫియర్ మొదలగు టెక్స్ టైల్ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టాయని గుర్తు చేశారు. "రవాణా సౌకర్యాలపరంగా ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుంది. హైదరాబాద్, నాగ్ పూర్, విజయవాడ ఇండస్ట్రియల్ కారిడార్‌కు అనుసంధానంగా ఉంది. ఫంక్షనల్ టెక్స్ టైల్స్, ఎకో, డైయింగ్, రీసైక్లింగ్ తదితర అంశాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని' మంత్రి వారికి వివరించారు. కస్టమైజ్డ్ ల్యాండ్ పార్సిల్స్, ప్లగ్ అండ్ ప్లే యూనిట్లు, నైపుణ్య మానవ వనరులు, సమర్థవంతమైన నాయకత్వం, స్థిరమైన ప్రభుత్వం, భౌగోళిక పరిస్థితులు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమని అన్నారు. తైవాన్ పారిశ్రామికవేత్తలు ముందుకొస్తే 'తెలంగాణ తైవాన్ మాన్యుఫాక్చరింగ్ జోన్' ప్రత్యేక టెక్స్ టైల్ క్లస్టర్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. టెక్స్ టైల్ రంగం అభివృద్ధికి టీటీఎఫ్ తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, రాష్ట్ర టెక్స్ టైల్స్ డైరెక్టర్ ధరణి, టిటిఎఫ్ సెక్షన్ చీఫ్ ఆర్థర్ చియాంగ్‌తో పాటు తైవాన్‌కు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇ-గవర్నెన్స్‌లో ఎస్తోనియా సహకారం

ఇ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ రంగంలో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన 'ఎస్తోనియా' సహకారం తీసుకుంటామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రెండు రంగాల్లో ఎస్తోనియా దేశం అగ్రగామిగా ఎదగడం అబ్బురపరుస్తోందని ప్రశంసించారు. శుక్రవారం ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో తనను కలిసిన వాణిజ్య ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్లో తెలంగాణ ఇంకా ప్రథమ దశలోనే ఉందనీ, వంద శాతం ప్రగతి సాధించిన ఎస్తోనియా సాంకేతిక సహకారం అందించాలని శ్రీధర్ బాబు కోరారు. వాణిజ్యం, ఏఐ సాంకేతికతలో కూడా కలిసి పనిచేయాలన్ని ఆకాంక్షను వెలిబుచ్చారు. ప్రజా సేవల విభాగాలను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు ఇ-గవర్నెన్స్ కీలకమని పేర్కొన్నారు. సెప్టెంబరులో తమ దేశం సందర్శించాలని మ్యారియే లూప్ చేసిన అభ్యర్థనకు మంత్రి సానుకూలంగా స్పందించారు. తమ అధికారుల బృందం ఎస్తోనియాలో పర్యటిస్తుందనీ, విద్య, ఇ గవర్నెన్స్, ఏఐ, రోబోటిక్స్‌లో పరస్పరం సహకరించుకునే విషయంపై చర్చిస్తారని వారికి హామీ ఇచ్చారు.

హెచ్‌ఎండిఎను సందర్శించిన జైపూర్ కమిషనర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎమ్‌డీఏ) ప్రణాళికా చర్యలను అధ్యయనం చేయడానికి జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ జెడిఎ ప్రతినిధి బృందం శుక్రవారం కార్యాలయాన్ని సందర్శించింది. జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ (జెడిఎ) కమిషనర్ ఆనంది నేతృత్వంలో ప్లానింగ్ డైరెక్టర్ ప్రీతిగుప్తా, అదనపు చీఫ్ టౌన్ ప్లానర్ అంకుర్ దధీచ్, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ రుషికేష్ కొల్టే హాజరయ్యారు. వారికి అమీర్‌పేటలోని హెచ్ఎండిఎ ప్రధాన కార్యాలయంలో మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఇతర సీనియర్ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హెచ్ఎండిఎ అభివృద్ధిపై సర్ఫరాజ్ అహ్మద్ సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుత మాస్టర్ ప్లాన్లు, రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్లు, ల్యాండ్ పూలింగ్ పథకాలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం 2050 కోసం రూపొందించిన సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను వివరించారు. ఇందులో కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్, ఆర్థికాభివృద్ధి ప్రణాళిక, బ్లూ-గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్‌లను ఏకీకృతంగా కలిపింది. హెచ్ఎండిఎ ఆధారిత బేస్ మ్యాప్ ద్వారా మొత్తం మెట్రోపాలిటన్ ప్రాంతానికి ఆధారభూతంగా పని చేస్తున్నదని కమిషనర్ వివరించారు. తెలంగాణలో ముఖ్యమైన పట్టణ ప్రాంతం కోసం 3డీ డిజిటల్ ట్విన్ అభివృద్ధి, అలాగే కొత్త కాంప్రెహెన్సివ్ బిల్డింగ్ రెగ్యులేషన్స్ రూపకల్పనలో ఉన్నట్టు తెలియజేశారు. ఇలాంటి పరస్పర సంస్థల మధ్య పరస్పర విజ్ఞాన మార్పిడి, విజయవంతమైన నమూనాలను అనుసరించడం, ప్రజలకే కేంద్రంగా ఉన్న పట్టణ పాలనను ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో ప్రయోజనం ఉంటుందని సర్ఫరాజ్ అహ్మద్ వివరించారు. అనంతరం హెచ్ఎండిఎ దూరదృష్టి ప్రణాళిక, సాంకేతిక చర్యలను జెడిఎ ప్రతినిధులు కొనియాడారు. కమిషనర్ ఇచ్చిన వివరాలపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో హెచ్ఎండిఎ సభ్యులు (ప్లానర్) ఎస్ దేవేందర్‌రెడ్డి, ప్లానింగ్ డైరెక్టర్లు కె.విద్యాధర్, ఎం.రాజేంద్ర ప్రసాదనాయక్, పలువురు టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు, ఇళ్లు నిరంతర ప్రక్రియ

- డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు రానివారు అధైర్య పడొద్దని, ఇది నిరంతర ప్రక్రియ అని డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ అన్నారు. విడతల వారీగా అందరికీ అన్ని సంక్షేమ పథకాలూ అందించే బాధ్యత ప్రభుత్వానిదని చెప్పారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక ఆడిటోరియంలో శుక్రవారం కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ కృష్ణవేణి అధ్యక్షత వహించగా, రామచంద్రనాయక్ మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్ ఉందని ప్రజలను మభ్యపెట్టిన కెసిఆర్ సుమారు పది లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారని తెలిపారు. పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసి అనేక మందిని ఇబ్బందులపాలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి రాగానే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశామని తెలిపారు. ప్రతినెలా జీతాలు చెల్లిస్తూ గత ప్రభుత్వం చేసిన పది లక్షల కోట్లకు అప్పులు చెల్లిస్తూ ప్రజాపాలన ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 60 వేల కొత్త ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచినట్టు చెప్పారు. రూ.150 కోట్లతో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించినట్టు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామచంద్రనాయక్

మెక్‌డొనాల్డ్స్‌లో ఇక శాఖాహార ప్రొటీన్స్ లభ్యం

హైదరాబాద్: సిఎస్ఐఆర్-సిఎఫ్‌టిఆర్ఐ సహకారంతో 100 శాతం శాఖహార ప్రొటీన్ ప్లస్ స్లైస్‌ను ప్రారంభించినట్లు మెక్‌డొనాల్డ్స్ ఇండియా (వెస్ట్ అండ్ సౌత్) వెల్లడించింది. ఈ స్లైస్ బర్గర్‌కు 5గ్రా ప్రొటీన్‌ను కలిగి ఉంటుందని తెలిపింది. రుచి, పోషకాహారాన్ని సమతుల్యం చేస్తూ ఈ ఆవిష్కరణ భారత్‌లో ప్రొటీన్ లోపాన్ని పరిష్కరిస్తుందని ఆ సంస్థ సిఇఒ అక్షయ్ జాటియా తెలిపారు.

ఎఎంఎన్ఎస్ స్టీల్ స్లాగ్ యాగ్రిగేట్స్ టెక్నాలజీకి లైసెన్స్

న్యూఢిల్లీ : ఆర్సెలర్‌మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఎఎం/ఎన్ఎస్ ఇండియా) రూపొందించిన స్టీల్ స్లాగ్ యాగ్రిగేట్స్ టెక్నాలజీకి లైసెన్స్‌ను పొందినట్లు పేర్కొంది. ఈ టెక్నాలజీతో గుజరాత్‌లోని హజీరా ప్లాంట్‌లో స్టీల్ స్లాగ్‌ను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి, రోడ్ల నిర్మాణంలో ఉపయోగించినట్లు తెలిపింది. ఈ లైసెన్స్ ద్వారా వ్యర్థాలను సంపదగా మార్చే కేంద్ర ప్రభుత్వ 'వేస్ట్ టు వెల్త్' మిషన్‌తో పాటు, సర్క్యులర్ ఎకానమీ, హరిత లక్ష్యాలకు అనుగుణంగా తమ ఉత్పత్తి పని చేయనుందని ఆ సంస్థ పేర్కొంది.

అనుమతి లేని సెల్‌టవర్లపై చర్యలేవి?

- గ్రేటర్‌లో అనుమతి లేనివి పది వేలు..!
- దశాబ్ద కాలంగా కంపెనీల ఇష్టారాజ్యం
- అటువైపు కన్నెత్తి చూడని జిహెచ్ఎంసి : సిపిఎం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఆస్తి పన్ను చెల్లించని సామాన్యులపై దౌర్జన్యం చేసే జిహెచ్ఎంసి అధికార యంత్రాంగం.. సెల్‌టవర్స్‌కు అనుమతి లేకపోయినా, ఫీజులు, పన్నులు చెల్లించకపోయినా అడిగే పరిస్థితే లేదని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేష్ అన్నారు. ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తాలోని సిపిఎం నగర కార్యాలయంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం శ్రీనివాస్, సభ్యులు ఆర్ వెంకటేష్‌తో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఎన్ని సెల్‌టవర్లు ఉన్నాయో జిహెచ్ఎంసి దగ్గర కనీసం లెక్కాపత్రం లేదన్నారు. లెక్కలతో సమాచారం సేకరించి 2017లోనే సిపిఎం పెద్ద ఆందోళన చేసిందని, అధికార యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పిందని గుర్తుచేశారు. ఎనిమిదేళ్లలో ఏ మార్పూ లేకపోగా సెల్ టవర్ కంపెనీలకు అధికార యంత్రాంగం ఊడిగం చేస్తోందని విమర్శించారు.ప్రస్తుతం జిహెచ్ఎంసి పరిధిలో ఎన్ని సెల్ టవర్లు ఉన్నాయి.. ఎంత ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారని తాము సమాచార హక్కు చట్టం కింద అడగ్గా.. టౌన్ ప్లానింగ్ విభాగం నగరంలో 3203 టవర్లకు అనుమతిచ్చినట్టు తెలిపిందన్నారు. 14 కంపెనీలకు చెందిన 1105 సెల్‌టవర్ల నుంచి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నామని చీఫ్ వ్యాల్యుయేషన్ ఆఫీసర్ చెప్పారన్నారు. ఈ టవర్ల నుంచి 2024-25లో బకాయిలతో కలిపి రూ.38.02 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.2.05 కోట్లు మాత్రమే వసూలు చేశారని వివరించారు. జీహెచ్ఎంసీ అనుమతించామంటున్న సెల్‌టవర్లలో మూడో వంతు టవర్ల నుంచి మాత్రమే పన్ను వసూలు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రతి సెల్‌టవర్ లక్ష రూపాయల ఫీజు చెల్లించి అనుమతి పొందాల్సి ఉండగా ఏ కంపెనీ ఫీజు చెల్లించట్లేదన్నారు.

జిహెచ్ఎంసి 2017-18లోనే 4773 సెల్‌టవర్ల నుంచి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నామని ప్రకటించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం 1105 టవర్ల నుంచి మాత్రమే వసూలు చేస్తున్నామని చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్నారు. ఇది నిర్లక్ష్యమా? కంపెనీలతో కుమ్మక్కైన ఫలితమా? అని ఎం.వెంకటేష్ ప్రశ్నించారు. కేంద్ర టెలికం శాఖ లెక్కల ప్రకారం.. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 13,979 సెల్‌టవర్లు ఉన్నాయని తేల్చిందని, ఇందులో 90శాతం జిహెచ్ఎంసి పరిధిలోనే ఉంటాయని అన్నారు. ఈ వివరాలు జీహెచ్ఎంసీ ఎందుకు సేకరించలేదని? ఈ టవర్ల నుంచి ఫీజులు, ఆస్తి పన్ను ఎందుకు వసూలు చేయరని ప్రశ్నించారు. పెద్ద సంఖ్యలో అనుమతి లేని సెల్‌టవర్లు కొనసాగడంపై వెంటనే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఫీజులు, ఆస్తి పన్ను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని, అనుమతి లేని టవర్లపై వెంటనే చర్యలు చేపట్టాలని సిపిఎం తరపున డిమాండ్ చేశారు.

నేడు లాసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్

- ఆగస్టు 4 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 22న సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో లా కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ శనివారం విడుదల కానుంది. శుక్రవారం లాసెట్ ప్రవేశాల కమిటీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల నాలుగు నుంచి 14 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనీ, ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని కోరారు. ఎన్‌సీసీ, సీఏపీ, వికలాంగులు, స్పోర్ట్స్ అభ్యర్థులకు అదేనెల 11 నుంచి 14 వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని వివరించారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను వచ్చేనెల 15న విడుదల చేస్తామని పేర్కొన్నారు. అదేనెల 16,17 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని తెలిపారు. వచ్చేనెల 22న లాసెట్ తొలివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని వివరించారు. అదేనెల 22 నుంచి 25 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. వచ్చేనెల 30 నుంచి లాసెట్ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. పూర్తి వివరాల కోసం https://lawcetadm.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఆగస్టు 25 నుంచి పీజీలాసెట్ రిజిస్ట్రేషన్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీలాసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ శనివారం విడుదల కానుంది. శుక్రవారం లాసెట్ ప్రవేశాల కమిటీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. అనంతరం లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పాండురంగారెడ్డి షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల 25 నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనీ, ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని కోరారు. ఎన్‌సీసీ, సీఏపీ, వికలాంగులు, స్పోర్ట్స్ అభ్యర్థులకు అదేనెల 27 నుంచి 29 వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని వివరించారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను సెప్టెంబర్ రెండున విడుదల చేస్తామని పేర్కొన్నారు. సెప్టెంబర్ మూడు, నాలుగు తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని తెలిపారు. అదేనెల ఎనిమిదిన లాసెట్ తొలివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని వివరించారు. అదేనెల తొమ్మిది నుంచి 13 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. సెప్టెంబర్ పదో తేదీ నుంచి పీజీలాసెట్ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

హైదరాబాద్‌లో 'బైండ్జ్' విస్తరణ



ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ ఆఫ్‌షోర్ ఫైనాన్షియల్ కన్సల్టింగ్ దిగ్గజం 'బైండ్జ్' తన కార్యకలాపాలను విస్తరించినట్లు ప్రకటించింది. నగరంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో తమ రెండవ డెలివరీ సెంటర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఆఫ్‌షోర్ ఫైనాన్షియల్ అడ్వైజరీ, కంప్లైయన్స్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఈ వ్యూహాత్మకంగా కొత్త సెంటర్‌ను ప్రారంభించామని బైండ్జ్ కన్సల్టింగ్ ఎండి, సిఇఒ శిరీష్ కొరడా తెలిపారు. "ఈ విస్తరణ మా క్లయింట్‌కు తక్షణ ప్రతిస్పందనాత్మక, స్కేలబుల్ డెలివరీని అందించడంలో మా నిబద్ధతను ప్రతిబింబించనుంది." అని అన్నారు.

పాడి కౌశిక్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోతున్నారు

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోతున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఆయన ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సిఎంపై నోటికొచ్చినట్టు విమర్శలు చేస్తూ బిఆర్‌ఎస్ అగ్రనేతల మెప్పుపొందే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధి స్థానంలో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. హుజురాబాద్ ప్రజలు అసహ్యించుకునేలా ఆయన ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కెటిఆర్ మంత్రిగా ఇతరుల ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని, ఆ విషయాన్ని కౌశిక్‌రెడ్డే చెప్పారని తెలిపారు. బిఆర్‌ఎస్‌లో ఈటల చేరుతారనే భయంతో కెసిఆర్ కుటుంబం వద్ద పేరు సంపాదించుకునేందుకే ఆయన అలా మాట్లాడుతున్నారని ఆరోపించారు.

బిసిలకు బిజెపి, బిఆర్‌ఎస్ వ్యతిరేకం

- ఎమ్మెల్యే సత్యనారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బిసి రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను అడ్డుకునే కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. బిసి రిజర్వేషన్ల గురించి మాట్లాడే అర్హత ఆ రెండు పార్టీలకు లేదని స్పష్టం చేశారు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ముస్లిం రిజర్వేషన్లను అమలు చేశారని గుర్తుచేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు ఆ విషయాన్ని తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. బిజెపి అగ్రవర్ణ పార్టీ అనీ, ఆ పార్టీలో బ్రాహ్మణ అధిపత్యం కొనసాగుతోందని విమర్శించారు.

'చేనేత' సమస్యలను పరిష్కరించండి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డికి ఆయా సంఘాల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన సంఘాల నాయకులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజగోపాల్‌రెడ్డి నివాసంలో కలిశారు. ప్రతి చేనేత మగ్గానికి ఉన్న జియో ట్యాగ్ అనుబంధ కార్మికులను మొత్తం ముగ్గురు ఉండేలా చూడాలని కోరారు. 350 చేనేత సంఘాలకు సంబంధించిన రూ.50 కోట్ల రుణాలను మాఫీ చేయడంతోపాటు కొత్త రుణాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేత సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ చేనేత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను పునరుద్ధరించాలి

- ఎన్‌డిఎఫ్‌డిసిని కోరిన ముత్తినేని వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వాలని, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య నేషనల్ దివ్యాంగ్ జన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి, చైర్మన్ అనిల్ కుమార్‌ను కోరారు. శుక్రవారం వీరయ్య న్యూఢిల్లీలో అనిల్ కుమార్‌తో పాటు ఆ కార్పొరేషన్ సిజిఎం, కార్యదర్శి ఆర్.కె.మిశ్రా, ప్రాజెక్ట్ హెడ్ డాక్టర్ వీనీత్ రాణా, ఎజిఎం వేణుగోపాల్‌రావుతో సమావేశమయ్యారు. గత 10 సంవత్సరాల నుంచి రాష్ట్రంలో వికలాంగులు వ్యాపారాలు చేసుకోవడానికి, ఇతర నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించినట్టు తెలిపారు. దీనిపై అక్కడి కార్పొరేషన్ అధికారులు, గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి సరైన స్పందన రానందునే నిధులు ఆగాయని సమాచారమిచ్చినట్టు ముత్తినేని వెల్లడించారు. ముత్తినేని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. దీంతో ఎన్‌డిఎఫ్‌డిసి అధికారులు సానుకూలంగా స్పందించినట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

పిహెచ్‌సిల్లో ఇన్సులిన్ కొరత

- రోగుల్లో పెరిగిపోతున్న షుగర్ లెవల్స్
- గాంధీ, ఉస్మానియాలోనూ నిండుకున్న నిల్వలు
- దాదాపు మూడు నెలలుగా సరఫరా కాని వైనం
- మధుమేహ బాధితులకు తప్పని తిప్పలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధుమేహగ్రస్తుల సంఖ్య పెరగడమే కాదు.. మారుతున్న జీవన శైలితో షుగర్ లెవల్స్ కూడా రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.. 30 ఏళ్ల వయస్సు దాటిన వారిలోనూ షుగర్ బయటపడుతోంది. ఈ క్రమంలో ఇన్సులిన్ వినియోగించే వారి సంఖ్య పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పిహెచ్‌సిలతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన ఆస్పత్రులైన గాంధీ, ఉస్మానియాలోనూ షుగర్ ఇన్సులిన్ నిల్వలు నిండుకున్నాయి. దాదాపు మూడు నెలలుగా సరఫరా నిలిచిపోవడంతో మధుమేహ బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక భారంతో బయట కొనలేక, సర్కార్ ఆస్పత్రుల్లో అందుబాటులో లేక.. మరోవైపు రోగుల్లో షుగర్ లెవల్స్ పెరుగుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయగా.. మరికొన్ని ఆస్పత్రుల్లో నిల్వలు లేవని వెనక్కి పంపిస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి

ముషీరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మధుమేహంతో బాధపడుతున్న నలుగురు ఆ దగ్గరలోని పిహెచ్‌సిలో ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకునేవారు. మూడు నెలలుగా ఇన్సులిన్ సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రయివేటులో కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇందుకు నెలకు రూ.వేలల్లో భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్సులిన్ కొరత ఏదో ఒకటి, రెండు కాదు.. రాష్ట్రంలోని దాదాపు 600కు పైగా పిహెచ్‌సిల్లో నెలకొంది. దాదాపు 70శాతం వరకు కొరత ఉంది. దీంతో ఆయా కేంద్రాలకు వచ్చే బాధితులకు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా నిల్వలు పూర్తిగా లేవని వైద్య సిబ్బంది చెబుతోంది. 30 ఏళ్ల దాటిన వారందరికీ మధుమేహ పరీక్షలు చేస్తుండటంతో పెద్ద సంఖ్యలో బాధితులు బయటపడుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య దాదాపు పది లక్షలు దాటిపోయింది.

ఏడాదికి 2 లక్షలు సరఫరా

సాధారణంగా బోధనాస్పత్రులు, ప్రాంతీయ, జిల్లా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కలిపి ఏడాదికి దాదాపు రెండు లక్షల వరకు ఇన్సులిన్ సరఫరా చేస్తున్నారు. ఇందులోనూ మధుమేహ తీవ్రత, బాధితుల పరిస్థితిని బట్టి నాలుగు రకాల ఇన్సులిన్లు ఉంటాయి. వైద్యుల పర్యవేక్షణలో ఇచ్చే రకం బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రులకు కొంత మేర సరఫరా జరుగుతున్నా, పిహెచ్‌సిల్లో ఎక్కువగా ఇచ్చే రకం నిల్వలు మాత్రం పూర్తిగా అడుగంటాయి.

గాంధీ, ఉస్మానియాలోనూ కొరతే..

నగరంలోని పెద్దాస్పత్రులైన గాంధీ, ఉస్మానియాలోనూ షుగర్ ఇన్సులిన్ కొరత వేధిస్తోంది. నో స్టాక్ బోర్డు పెట్టేయడంతో మధుమేహ బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు ప్రతిరోజూ సుమారు 300 మంది వరకు మధుమేహ బాధితులు ఇన్సులిన్ కోసం వస్తుంటారు. దాదాపు మూడు నెలలుగా స్టాక్ అయిపోవడంతోపాటు టిఎస్‌ఎండిసి నుంచి సరఫరా ఆగిపోవడంతో ఆయా ఆస్పత్రుల కౌంటర్ల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో బాధితులు ప్రయివేటు మెడికల్ షాపుల్లో ఇన్సులిన్ కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

పెరుగుతున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు

రాష్ట్రవ్యాప్తంగా మధుమేహ బాధితులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. హైదరాబాద్ నగరంతోపాటు జిల్లాల్లోనూ చేస్తున్న ఎన్‌సిడి స్క్రీనింగ్ పరీక్షల్లో 30 ఏళ్లకు షుగర్ వ్యాధి బారినపడుతున్న వారు ఎక్కువగా బయటపడుతున్నారు. ఇప్పటికే ఇన్సులిన్ తీసుకుంటే తప్ప గడవని వారికి వీరు కూడా తోడవ్వడంతో షుగర్ మందులు, ఇన్సులిన్‌కు డిమాండ్ పెరుగుతోంది. మధుమేహాన్ని అదుపులో పెట్టుకునేందుకు మందుల దశ నుంచి ఇన్సులిన్ దశకు చేరిన వారు లక్షల్లో ఉన్నారు. అలాంటి వారంతా పిహెచ్‌సిలు, జిల్లా, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు ఉచితంగా ఇచ్చే ఇన్సులిన్ కోసం క్యూ కడుతుంటారు.

మహీంద్రా ఎక్స్‌యువి 3ఎక్స్‌ఒ రెవ్‌ఎక్స్ విడుదల



ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మహీంద్రా అండ్ మహీంద్రా తన ఎక్స్‌యువి 3ఎక్స్‌ఒ రెవ్‌ఎక్స్‌ను హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేసింది. శుక్రవారం ఇక్కడ దీనిని ఎంఅండ్‌ఎం సౌత్ జోనల్ సేల్స్ హెడ్ అరునంగ్షు రాయ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దీని ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.8.94 లక్షలుగా నిర్ణయించామన్నారు. ఎక్స్‌యువి 3ఎక్స్‌ఒ ఇటీవలే ఒక లక్ష యూనిట్ల అమ్మకాల మైలురాయిని చేరిందని తెలిపారు. 3ఎక్స్‌ఒ రేవ్‌ఎక్స్‌ను అత్యాధునిక ఫీచర్లతో అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఇది ఐదు రంగుల్లో భిస్తుందన్నారు. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 4 డిస్క్ బ్రేక్‌లు, మాన్యువెల్, ఆటోమెటిక్ 1.2 లీటర్ ఇంజిన్‌తో లభిస్తుందన్నారు.

వరంగల్ ఎయిర్‌పోర్టు భూసేకరణకు నిధులు

- రూ.205 కోట్లు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్టు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.205 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. మామునూరు వద్ద కొత్త బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మార్చి నెలలో పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. ఈ విమానాశ్రయానికి అన్ని అనుమతులిస్తూ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఎఎఐ) నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. మరో 253 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్తే కొత్త విమానాశ్రయ నిర్మాణం మొదలు పెడతామని కేంద్రమంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే భూసేకరణ కోసం ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది.

కెసిఆర్ సిఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ మళ్లీ సిఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని బిఆర్‌ఎస్ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ అన్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో శుక్రవారం నిర్వహించిన 'ఆత్మగౌరవ గర్జన' సభకు ఆయన హాజరై మాట్లాడారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ఆధారంగానే రాష్ట్రాన్ని తెచ్చుకున్నామన్నారు. కరోనా సమయంలోనూ తమ ప్రభుత్వం ఏ పథకాలు ఆపలేదని చెప్పారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో ఓటుతో కాంగ్రెస్ నేతలకు బుద్ధి చెప్పాలని కెటిఆర్ పిలుపునిచ్చారు.

"పెట్టుబడి సాయం ఎకరానికి రూ.10వేలు ఇస్తే.. కాంగ్రెస్ రూ.15 వేలు ఇస్తామని చెప్పింది. దళితబంధు కింద రూ.10 లక్షలు ఇస్తుంటే.. కాంగ్రెస్ రూ.12లక్షలు ఇస్తామంది. రెండు సార్లు రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టింది. కౌలు రైతులకూ పెట్టుబడి సాయం చేస్తామని ఇప్పటికీ అమలు చేయలేదు"అని కెటిఆర్ విమర్శించారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా లింగంపేటలో దళితుడైన మాజీ ఎంపిపి ముదాం సాయిలును పోలీసులు బట్టలు ఊడదీసి అవమానించారని, అతనికి జరిగిన అవమానం తెలంగాణలోని దళితులందరికీ జరిగిందని కెటిఆర్ అన్నారు. అవమానం జరిగిన సాయిలుకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం సాయిలు ఇంటి వద్ద కేటీఆర్ భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమడుగు సురేందర్, గంప గోవర్ధన్, బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, మాజీ జడ్‌పి చైర్మన్ రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల్లో పారదర్శకతకు ధన్యవాదాలు

- టిటిజిడిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారదర్శకంగా అడిషనల్ డిఎంఇ, ప్రొఫెసర్ల ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి చేసినందుకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిటిజిడిఎ) ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ బొల్లెపాక, సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల, కోశాధికారి డాక్టర్ ఎల్ రమేశ్, ఉపాధ్యక్షులు డాక్టర్ కిరణ్ ప్రకాశ్ మంత్రిని కలిసి పలు విషయాలపై విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి వారితో, అసోసియేట్ ప్రొఫెసర్ల పదోన్నతులు కూడా ఇదే విధంగా కౌన్సెలింగ్‌తో నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాదేతర మెడికల్ కాలేజీల్లో పని చేస్తున్న టీచింగ్ ఫ్యాకల్టీకి హైదరాబాదులో ఖాళీలను ప్రత్యేకంగా ఉంచినట్టు మంత్రి వెల్లడించారు. పిఎంసిఎ అలవెన్స్, ప్రత్యేక వేతన శ్రేణులకు సంబంధించి హైదరాబాద్, ఇతర ప్రాంతాల మధ్య ఉన్న ఆర్థిక తేడాలపై ప్రభుత్వం పూర్తిగా అవగాహన కలిగి ఉందనీ, తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.



సాహితీ విశ్వంభరుడు సినారె

ప్రజాశక్తి - కల్చరల్

విశ్వంభర కావ్యంతో జ్ఞాన పీఠం స్థాయికి చేరిన సినారె జాతీయ సాహిత్యంలో విశ్వంభరుడని శాసన మండలిలో ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంత రావు కళావేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా డాక్టర్ సి నారాయణ రెడ్డి యాదిలో పేరిట ఆయన జయంతి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు సూదనాచారి మాట్లాడుతూ తెలంగాణ మారుమూల పల్లె నుంచి తన అక్షర శక్తితో కేంద్రం నుంచి పద్మవి భూషణ్‌గా గౌరవించబడిన సినారె రాష్ట్ర ప్రభుత్వం పలు పదవులకు ఎంపిక చేసిందని గుర్తు చేశారు. నాటి మహా నటుడు ఎన్‌టిఆర్‌కు అత్యంత ఆత్మీయుడు ఇన సినారే తొలిసారిగా ఆయనకు పాట రాసి సినీ రంగ ప్రవేశం చేశారని ప్రశంసించారు. ప్రధాన ప్రసంగం చేసిన సాహితీ వేత్త బి జయ రాములు సినారె రచించిన కావ్యాలు విశ్లేషణ చేశారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై గాయకుడు బాలాజీ కుమార్ రేవిచందర్ పాల్గొన్నారు.

టిజిపిసిబిసభ్య కార్యదర్శిపై హెచ్‌ఆర్‌సి అసంతృప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చట్టబద్ధ బాధ్యతను నిర్వర్తించకుండా, కేవలం సంబంధిత ఇఇ నివేదికను పంపించడం పట్ల తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. హైదరాబాద్ మల్కాజిగిరిలోని 'మాత కేటరర్స్' అనే అనధికారిక వాణిజ్య కాంటీన్ కార్యకలాపాలు పర్యావరణ కాలుష్యానికి, ఆరోగ్య హానికీ కారణమవుతున్నాయని, పలు మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు పివిఎన్ కాలనీవాసులు ఆరోపించారు. దీంతో వారు కమిషన్‌లో కేసు దాఖలు చేసిన కేసు దాఖలు చేశారు. ఈ కేసులో కమిషన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అఖ్తర్ గారి ఆధ్వర్యంలో తుది తీర్పునిచ్చింది. ఆ తీర్పులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది.

గురుకులాల ఫౌండేషనల్ సిఒఇల్లో 31న స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాంఘిక సంక్షేమ గురుకులాల ఫౌండేషనల్ సిఒఇల్లో జులై 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఫౌడేషన్ సీఓఈల్లో 1,560 సీట్లు ఉండగా ఇప్పటికే 1,420 సీట్లు భర్తీ అయ్యాయి. జిల్లాలవారీగా నడుస్తున్న 26 సిఒఇల్లో ప్రవేశాలు తుది దశకు చేరుకున్నాయి. రుక్మాపూర్ సైనిక పాఠశాలలో వంద శాతం అడ్మిషన్లు జరిగాయి. ఫౌండేషనల్, జిల్లా స్థాయి సిఒఇల్లో ఇనిస్టిట్యూట్ల వారీగా ఖాళీల వివరాల కోసం సంస్థ వెబ్‌సైట్‌లో చూడొచ్చు. ప్రీమియర్ సీఓఈలో గడిచిన ఐదేళ్లలోనే అత్యధికంగా 91 శాతం, ఇంటర్ ఫస్టియర్ కు సంబంధించి ఓవరాల్ పర్ఫార్మెన్స్‌ను చూస్తే గడిచిన ఐదేళ్లలో అత్యధికంగా 86.7 శాతం భర్తీ అయ్యాయి.

పంటల నమోదులో ఎస్‌ఎఆర్ డాటా


- తుమ్మలకు యూనివర్సిటీ ప్రతిపాదనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సాగవుతున్న పంటల వివరాలను అంచనా వేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు ప్రతిపాదనలు చేసింది. పంటల నమోదులో ఎస్‌ఎఆర్ డాటా వినియోగం ప్రాముఖ్యతను వివరించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో యూనివర్సిటీ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సాగవుతున్న పంటల విస్తీర్ణం అంచనా వేయటం ద్వారా రానున్న కాలంలో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు వీలుంటుందని చెప్పారు. అందుకోసం సాంకేతిక పరిజ్ఞానం, ఇతర వసతులను ఉపయోగించి పంటల వారిగా లెక్కలు తీసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

రానున్న కాలంలో ప్రభుత్వం అమలు చేయనున్న పంటల బీమా పథకానికి సమగ్ర సాంకేతిక పరిజానాన్ని యూనివర్సిటీ అందించాలని సూచించారు. వివిధ సాంకేతిక సంస్థలతో ఇంతకు ముందు జరిపిన సంప్రదింపుల తరహాలోనే ఇప్పుడు స్విట్జర్లాండ్ సంస్థ భాగస్వామ్యంతో చేసిన ప్రయోగాల తీరును మంత్రికి వివరించారు. వివిధ పంటలను ఆశించు చీడపీడల వివరాలను కూడా సెన్సార్ అమర్చడం ద్వారా ముందుగానే తెలుసుకునే వీలుందని చెప్పారు. ఆ దిశగా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేపట్టాలంటూ వైఎస్ చాన్సలర్‌కు సూచించారు. సమావేశంలో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ డాక్టర్ సమీరేందు మోహంతి, శాస్త్రవేత్త డాక్టర్ టిఎల్ నీలిమ, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బలరాం, డిజిటల్ అగ్రికల్చర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బి బాలాజీ నాయక్ తదితరులు ఉన్నారు.

ఎసిబికి చిక్కిన రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చాలా కాలంగా అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ రూ. రెండు లక్షలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు. ఎసిబి డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్ర నగర్ సర్కిల్ జిహెచ్‌ఎంసి పరిధిలోని ఒక హెూటల్ ఫుడ్ కోడ్ నిర్వహణలో చాలా లోపాలు ఉన్నాయని హెూటల్ యజమానిని రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిప్యూటీ కమిషనర్ రవికుమార్ బెదిరించారు. దాంతో యజమాని రూ.ఐదు లక్షలు ఇవ్వలేనని, రూ.రెండు లక్షలు ఇస్తానని బేరం కుదుర్చుకున్నాడు. అనంతరం ఆ హెూటల్ యజమాని ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం మధ్యాహ్నం రెండు లక్షల రూపాయలు కమిషనర్‌కు ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తర్వాత కారును తనిఖీ చేయగా అందులో ఉన్న బ్యాగులో కూడా డబ్బులు దొరికాయి. కమిషనర్ ఇంట్లో కూడా సోదాలు నిర్వహించారు. చాలా కాలంగా అతనిపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే వెంటనే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంటాయని డిఎస్‌పి తెలిపారు. ఈ మేరకు రవికుమార్‌ను అరెస్ట్ చేసి ఎసిబి కోర్టులో హాజరు పరిచారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జిఒ 49ను పునరుద్ధరిస్తే రాజీనామా చేస్తా

- ప్రభుత్వంలో ఉండి ధైర్యంగా ప్రశ్నించింది నేనే..
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జివో 49ను పునరుద్ధరిస్తే రాజీనామా చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో పోడు రైతులు, అడవి బిడ్డల రాకపోకలపై ఆంక్షలు విధించడంపై అటవీశాఖ అధికారులను హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు రైతులపై అటవీశాఖ అధికారులు ఆంక్షలు పెడితే ఊరుకునేది లేదన్నారు. ప్రజలు, గిరిజనులతో కలిసి తరిమి కొడతామంటూ ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు. జిఒ నంబర్ 49ని తిరిగి అమలులోకి తెస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, ప్రభుత్వంలో ఉండి కూడా ఇంత ధైర్యంగా ప్రకటించింది తానేనని అన్నారు. నా ప్రాంత ప్రజల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. అలాగే, కవ్వాల్ టైగర్ జోన్‌లో భారీ వాహనాల రాకపోకలపై ఉన్న నిషేధం ఎత్తేయాలని డిమాండ్ చేశారు. దీనిపై అటవీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పేదవాడినైన తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. టైగర్ జోన్, భారీ వాహనాలపై అటవీ ఆంక్షల విషయంలో కూడా తగ్గేది లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను వారికి అందించడంలో అధికారులు ముందుండాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, మార్కెట్ కమిటీ చైర్మెన్ దుర్గమ్మ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసిఉల్లా, పిఎసిఎస్ చైర్మన్ అల్లం రవి, తహసీల్దార్ రాజామనోహర్‌రెడ్డి, ఎంపిడిఒ ఉమర్ షరీఫ్, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్‌ఐలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మలబార్‌లో 'బ్రైడల్ జ్యువెలరీ' ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ నగరంలోని సోమాజిగూడ షోరూంలో 'బ్రైడల్ జ్యువెలరీ' ప్రదర్శనను ఏర్పాటు చేసింది. జులై 26 నుండి ఆగస్టు 10 వరకు దీన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ యాజమాన్యం శుక్రవారం మీడియాతో తెలిపింది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నవ వధువుల కోసం కళాత్మక ఆభరణాలను ప్రదర్శన, విక్రయానికి ఉంచుతున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా బంగారు, రత్నాభరణాల తయారీ ఛార్జీలపై 30 శాతం వరకు తగ్గింపును ఇస్తున్నామని తెలిపింది. వజ్రాభరణాల విలువపై 30 శాతం వరకు తగ్గింపు పొందవచ్చని పేర్కొంది. ఆగస్టు 8 వరకు ఆఫర్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థులకు పతకాలు



ప్రజాశక్తి - హైదరాబాద్

అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థులు స్నేహిల్ ఝా, ఆగం షాలు స్వర్ణ, రజత పథకాలు గెలుచుకున్నారు. 2025 జులై 18 నుండి 24 వరకు ఫ్రాన్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మక ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు ప్రతిభతో ఆకట్టుకున్నారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణ ఓ ప్రకటనలో వెల్లడించారు. అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ అనేది జూనియర్ కాలేజీ విద్యార్థుల కోసం ప్రపంచ వ్యాప్తంగా జరిగే అత్యంత ప్రతిష్టాత్మకమైన పరీక్ష అని తెలిపారు. 87 దేశాల నుండి పాల్గొన్న వందలాది విద్యార్థులతో తమ విద్యార్థులు పోటీ పడ్డారన్నారు. ఈ విజయం తమ విద్యా సంస్థల్లో అందించే అత్యుత్తమ శిక్షణకు తార్కాణంగా నిలుస్తుందన్నారు.

గురుకులంలో విద్యార్థులను కరిచిన ఎలుకలు

- ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబాపూలే బిసి బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపల్ పరిధి బోర్నపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బిసి బాలుర గురుకుల పాఠశాల (సైదాపుర్)లో బుధవారం రాత్రి ఆరుగురు విద్యార్థులను ఎలుకలు కరిచాయి. 8వతరగతి విద్యార్థులు యశ్వంత్, సాయిచరణ్, కౌశిక్, అక్షిత్, శృజన్, 9వ తరగతికి చెందిన రక్షిత్‌ను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించి, వ్యాక్సిన్ వేయించారు. విషయం తెలుసుకున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ బండ శ్రీనివాస్, పలువురు నాయకులు పాఠశాలకు వెళ్లి పిల్లలను పరామర్శించారు. ఈ విషయమై ప్రిన్సిపల్ రాణిని వివరణ కోరగా.. విద్యార్థులకు ప్రమాదం ఏమీ లేదని, ఆరుగురికి కరిచినట్టు తెలిసిందని, మరో ముగ్గురిని కరిచినట్టు అనుమానం ఉందని తెలిపారు. అందరికీ వ్యాక్సిన్ వేయించినట్టు తెలిపారు.

భార్యాభర్తలు, మంత్రుల ఫోన్ల ట్యాపింగ్

- బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి భార్యాభర్తలు, తన మంత్రివర్గంలో మంత్రులు, ఎమ్యేల్యేల ఫోన్లూ ట్యాపింగ్ చేస్తూ వింటున్నారని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ అంటూ లీకులిస్తూ ముఖ్యమంత్రి కాలం వెళ్లదీస్తున్నారనీ, ఆరు గ్యారంటీలను అమలు చేసేంత వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు. రేవంత్ సర్కార్ పై సీబీఐ, ఈడీ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రయివేటు ఫోన్ హ్యాకర్లతో హీరోయిన్ల ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపించారు. తన ఫోన్ ట్యాపింగ్‌పై డిసెంబర్ 5న ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదనీ, తన భార్య ఫోన్ ట్యాప్ చేస్తున్నారని కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయని మంత్రులు ఢిల్లీలో కూర్చున్నారనీ, అక్కడ తెలంగాణ కాంగ్రెస్ పంచాయతీ జరుగుతున్నందునే క్యాబినెట్ వాయిదా పడిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ హయాంలో తన ఫోన్ ట్యాప్ కాలేదని, అందుకే సిట్ తనను పిలవలేదని చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డికి మానసిక వ్యాధి ఉందని ఆరోపించారు. టిపిసిసి ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ఫోన్‌ను కూడా రేవంత్ రెడ్డి ట్యాప్ చేస్తున్నారని తెలిపారు.